# ప్రశాంతంగా నిమజ్జనం



గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్ (రంగధాముని చెరువు)లో గణేశ్ నిమజ్జనాలు ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాం గం ఊపిరి పీల్చుకుంది. ఈనెల 7వ తేదీ నుంచి 18వ తేదీ 6 గంటల వరకు 5,018 విగ్రహాల వరకు నిమజ్జనం అయినట్లు అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ లా అండ్ ఆర్డర్ ఎస్‌హెచ్‌వో కొత్తపల్లి ముత్తు, ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో ముత్తుయాదవ్, లేక్ ఇన్‌చార్జిగా వ్యవహరించిన జీహెచ్‌ఎంసీ మూసాపేట్ సర్కిల్ ఈఈ వనమల శ్రీనివాస్ వీరు ముగ్గురు ఎంతో కీలకంగా వ్యవహరించడంతో పాటు జడ్సీ అపూర్వ్ చౌహాన్‌కు ఏర్పాట్లు చేశారు. ఇంజనీరింగ్, యూబీడీ, ఎంటమాలజీ, ఎలక్ట్రికల్ ఉద్యోగులు, సిబ్బందితో పని చేయించడంలో తనదైన ముద్ర వేశారు.



నిమజ్జనానికి కేపీహెచ్‌బీ ఏడోఫేజ్ గణనాథుడు

### ఎప్పటికప్పుడు వ్యర్థాల తొలగింపు

నిమజ్జనాల ప్రక్రియ ప్రారంభం నుంచే ఎప్పటికప్పుడు వ్యర్థాల తొలగింపు చేపట్టారు. అయినా రాత్రి వేళలో నీటిలో తేలియాడుతూ చెత్తాచెదారం, ప్లాస్టిక్ వస్తువులు, పూలు కన్పిస్తున్నా.. నిమజ్జనాల అనంతరం ఐడీఎల్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తామని అధికారులు చెబుతున్నారు.

● గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చందానగర్, శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో మియాపూర్ పటేల్‌చెరువు, చందానగర్ గంగారం పెద్దచెరువు, మాదాపూర్ దుర్గం చెరువు, రాయదుర్గం మల్కంచెరువులో గణేశులను నిమజ్జనం చేశారు. గచ్చిబౌలి డివిజ్ గుల్‌మొహర్ యూత్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూ వేలం పాటలో రూ.1.77లక్షలకు రామేశ్వరంరెడ్డి తన మనవరాలు హర్షినిరెడ్డి దక్కించుకున్నారు

### ● నిమజ్జనానికి తరలిన గణేశులు

కేపీహెచ్‌బీకాలనీ: గణేశ్ నిమజ్జన వేడుకలు బుధవారం కొనసాగాయి. కేపీహెచ్‌బీ ఏడోఫేజ్ బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన గణనాథున్ని ఊరేగింపుగా తరలించారు.

### ● 9,731 గణేశుల నిమజ్జనం

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి జోన్ నాలుగు సర్కిళ్ల పరిధిలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొత్తం 9,731 వినాయక విగ్రహాలు ఆయా ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, జీహెచ్‌ఎంసీ ఏర్పాటు నీటి కొలన్లలో భక్తులు నిమజ్జనం చేసినట్లు జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు.



కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్‌లో వ్యర్థాలను తీసుకెళ్తున్న వాహనం

# హెచ్‌ఎంటీ జంగిల్‌లో గణేశ్ విగ్రహ వ్యర్థాల డంప్

- డీజిల్ డబ్బుల కోసమే డంప్ చేశారంటున్న స్థానికులు
- అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్





హెచ్‌ఎంటీ స్థలంలో డంప్ చేస్తున్న విగ్రహాల వ్యర్థాలు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించింది. కానీ కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని కొందరు అధికారులు పనుల్లో నిర్లక్ష్యం వహిస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. జంట సర్కిళ్ల పరిధిలో గణేశుల నిమజ్జనం పూర్తయింది. అయితే విగ్రహాల వ్యర్థాలను అల్వాల్ ప్రాంతంలోని డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. కానీ అధికారులు, సిబ్బంది ఆ వ్యర్థాలను గుట్టు చప్పుడు కాకుండా లారీలలో తీసుకొచ్చి హెచ్‌ఎంటీ నిర్మానుష్య ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. ప్రధానంగా ట్రాన్స్‌పోర్టు వ్యవహారం చూస్తున్న ఓ ఇంజనీర్ జీహెచ్‌ఎంసీ అధికారులకు తప్పుడు నివేదికలు అందిస్తూ అల్వాల్‌కు తరలించకుండానే హెచ్‌ఎంటీ ప్రాంతంలోనే డంప్‌చేసి డీజిల్‌లో గోల్‌మాల్ చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్లలోనే తొమ్మిదేళ్లగా విధులు నిర్వహిస్తున్న ఈ ఇంజనీర్ ఇక్కడ ఆయన ఆడిందే ఆట.. పాడిందే పాటగా కొనసాగుతోంది. అంతేకాక కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో పనిచేస్తూ గాజులరామారం సర్కిల్ ట్రాన్స్‌పోర్టు వ్యవహారాలను చూడటం కూడా వివాదాస్పదంగా మారింది. అయినా ఆ అధికారిలో ఏ మార్పు రావడం లేదు. గణేశ్ వ్యర్థాల తరలింపులో డీజిల్ కోసం కక్కుర్తి పడుతూ హెచ్‌ఎంటీ జంగిల్‌లో డంప్ చేస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి వ్యర్థాలను తరలించాలని భక్తులు కోరుతున్నారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### వ్యర్థాలను తరలిస్తాం

గాజులరామారం సర్కిల్ హెచ్‌ఎంటీ స్థలంలో డంప్‌చేసిన వినాయక విగ్రహాలను వెంటనే తలిస్తాం. డంపింగ్ యార్డులో స్థలం లేకపోవడతోనే ఇక్కడ నిల్వచేస్తున్నాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా నిల్వ చేసిన విగ్రహాలను తరలిస్తాం.

- మల్లారెడ్డి, గాజులరామారం ఉపకమిషనర్

## నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

మాదాపూర్, సెప్టెంబర్18(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 23వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రధానోపాధ్యాయుడు విజయ్‌భాస్కర్ బుధవారం తెలిపారు. జనవరి 2025 18న ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను సన్మానించిన జర్నలిస్టులు

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి: ఎమ్మెల్యే

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్18(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని పేట్ బషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని జర్నలిస్టు కాలనీకి చెందిన జర్నలిస్టులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, కాలనీ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో రోడ్లు, మురుగునీరు, వీధిదీపాలు, మంచి నీటి సరఫరా వంటి వసతులను కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో ఆ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆస్కాని మారుతీసాగర్, సీనియర్ జర్నలిస్టులు లాలయ్య, దేవేందర్, కృష్ణారావు, మారుతీకుమార్ పాల్గొన్నారు.

● జీడిమెట్ల డివిజన్‌లోని దండమూడి ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను జీడిమెట్ల దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

## అక్రమంగా నిర్మించిన బేస్‌మెంట్ కూల్చివేత

గాజులరామారం, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభు త్వ స్థలంలో వెలిసిన అక్రమ బేస్‌మెంట్‌ను కుత్బుల్లాపూర్ రెవె న్యూ అధికారులు బుధవారం తొలగించారు. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లోని ప్రభుత్వ సర్వేనెంబరు 342లో కబ్జాదారులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి, రెండు బేస్‌మెంట్‌లను నిర్మించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు తహసీల్దార్ ఆదేశాల మేరకు సిబ్బంది అక్రమ బేసిమెట్లను తొలగించారు.



బేస్‌మెంట్‌లను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

## బీజేపీ నేతల వ్యాఖ్యలపై నిరసన

గాజులరామారం, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ నేత, పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధీపై బీజేపీ శివసేన నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సరైనవి కావని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాలతో గాజులరామారం డివిజన్‌లోని చంద్రగిరినగర్ చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రశీద్‌బేగ్, రశీద్‌బాయ్, లాల్‌మహ్మద్ పాల్గొన్నారు.

## అక్టోబర్ 2 నుంచి స్వచ్ఛత సేవ

దుండిగల్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపల్ పరిధిలో స్వచ్ఛత సేవ 2024లో కార్యక్రమంలో భాగంగా స్కూల్స్‌లో పిల్లలతో అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు స్వచ్ఛ ప్రతిజ్ఞ బుధవారం చేయించారు. బౌరంపేట పాఠశాలలో పిల్లలతో స్వచ్ఛ మానవహారం నిర్మించారు. స్వచ్ఛత ర్యాలీని చేయించారు. ఈ సందర్భంగా దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. అక్టోబర్ 2న స్వచ్ఛత సేవ జరగబోయే కార్యక్రమాల గురించి వార్డు అధికారులందరికీ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మేనేజర్ సునంద, టీపీఓ సంజన, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, శానిటరీ అధికారులు రామచందర్, అంజయ్య, అన్ని వార్డుల అధికారులు, జావాన్‌లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెంకన్నహిల్స్ కాలనీలో బ్రిడ్జి ఎత్తుపెంచాలి

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ వెంకన్నహిల్స్ బ్రిడ్జి నిర్మాణంలో జరుగుతున్న అవకతవకలపై చర్యలు తీసుకోవాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బుధవారం ఉపకమిషనర్ వి.నర్సింహకు వినతిపత్రం అందజేశారు. దాదాపు 70 లక్షల రూపాయల వ్యయంతో చేపడుతున్న ఈ బ్రిడ్జి నిర్మాణంలో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్టు పేర్కొన్నార. బ్రిడ్జి ఎత్తు పెంచి, వెడల్పు చేయాలని కోరారు. బ్రిడ్జి కిందకు ఉండటంవల్ల చిన్న వర్షానికే నీరంతా ఇళ్లల్లోకి వస్తుందని పేర్కొన్నారు. తప్పకుండా పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీసీ తెలిపారు.

## బోధన, పరిశోధనా నైపుణ్యాలను మెరుగుపరచుకోండి

### గీతం ఆర్థికశాస్త్ర అధ్యాపకులకు, ఇన్‌చార్జి వీసీ ప్రొ.గౌతమరావు సూచన

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గీతంలో ఆర్థిక శాస్త్రం బోధిస్తున్న అధ్యాపకులు తమ బోధన, పరిశోధన నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుని సమీప భవిష్యత్‌లో మంచి ఫలితాలను సాధించాలని గీతం ఉప కులపతి (ఇన్‌చార్జి) ప్రొఫెసర్ వై.గౌతమరావు సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో బోధనాశాస్త్రం, పరిశోధన నైపుణ్యాలను పెంచడం, ఎకనామెట్రిక్ విశ్లేషణలో ఆర్ యొక్క ఉపయోగం అనే అంశంపై ఈనెల 18, 20వ తేదీ వరకు నిర్వహించనున్న అధ్యాపక వికాస కార్యక్రమాన్ని (ఎఫ్ డీపీ) బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఎకనామెట్రిక్ విశ్లేషణలో ఆర్ యొక్క ఉపయోగంపై దృష్టి సారించి బోధన, పరిశోధనలో అధ్యాపకుల నైపుణ్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేశారు. గీతం మూడు ప్రాంగణాలలోని ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు కలిసి పనిచేయాల్సిన ఆశ్యకతను ఈ సందర్భంగా వీసీ నొక్కి చెప్పారు. ఈ మూడు రోజుల ముఖాముఖి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని అధ్యాపకులను ఆయన ప్రోత్సహించారు. ఈ మూడు రోజుల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు సూచించారు. ఈ మూడు రోజుల ఎఫ్ డీ పీకి బిట్స్ హైదరాబాద్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ. భీమేశ్వర్‌రెడ్డి ప్రధాన వక్తగా వ్యవహరించనున్నారు. కార్యక్రమాన్ని జీఎస్‌ఏహెచ్‌ఎస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నెల్సన్ మండేలా షణ్ముగం సమన్వయం చేశారు. శుక్రవారం వరకు ఈ కార్యక్రమం కొనసాగనున్నది.

# ఫలితాల ఫైళ్లను పెండింగ్ పెట్టొద్దు

- జేఎన్‌టీయూ ఉన్నతాధికారులకు ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ ఆదేశం
- బీటెక్ ఫలితాలను వెంటనే ప్రకటించేలా చర్యలు తీసుకోవాలన్న బుర్రా వెంకటేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అఫిలియేటెడ్, అటానమస్ కాలేజీల విద్యార్థులకు సంబంధించిన పరీక్షా ఫలితాలను పెండింగ్‌లో ఉంచొద్దని ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ బుర్రా వెంకటేశం యూనివర్సిటీ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ యూనివర్సిటీకి నెలకు ఒక్కసారి కూడా రాకపోతుండడంతో వర్సిటీలోని వివిధ విభాగాల, అటానమస్ కళాశాలలకు సంబంధించిన వందల కొద్దీ ఫైళ్లను వర్సిటీ ఉన్నతాధికారులు రెండు నెలలుగా పెండింగ్‌లో పెట్టారు. ఈ విషయమై 'వీసీ కోసం ఎదురుచూపులు' శీర్షికన ఈనెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఇన్‌చార్జి వీసీ తాజాగా స్పందించారు. అటానమస్ కాలేజీల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులు రాసిన 2, 4, 6 సెమిస్టర్ పరీక్షా ఫలితాలను నిలుపుదల చేసిన ఉన్నతాధికారులపై వీసీ ఆగ్ర హం వ్యక్తం చేశారు. తక్షణం ఫలితాలను వెల్లడించేలా చర్యలు తీసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్‌ను, రెక్టార్‌ను ఆయన ఆదేశించారు. ఉన్నతాధికారులు సమన్వయంగా పనిచేసి, విద్యార్థుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వీసీ సూచించారు. వైస్ చాన్స్‌లర్ ఆదేశాల మేరకు దాదాపు 50కి పైగా అటానమస్ కళాశాలలకు చెందిన సుమారు 200 ఫైళ్ల క్లియరెన్స్‌ను ఉన్నతాధికారులు బుధవారం షురూ చేశారు. సెమిస్టర్ ఫలితాలకు సంబంధించిన ఫైళ్లకు జేఎన్‌టీయూ అధికారుల నుంచి ఎట్టకేలకు మోక్షం లభించడంలో అటు అటానమస్ కాలేజీల యాజమాన్యాలు, ఇటు ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## కాల్పుల కేసులో పోలీసు కస్టడీలో ముగ్గురు

- ప్రధాన నిందితులను కోర్టుకు సరెండర్ చేసిన జీడిమెట్ల పోలీసులు
- వినాయక చవితి బిజీలో కస్టడీకి తీసుకోవడంపై అనుమానాలు

జీడిమెట్ల, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలో సంచలనం రేపిన గాజులరామారం కాల్పుల కేసులో ప్రధాన నిందితులైన ముగ్గురు వ్యక్తులను జీడిమెట్ల పోలీసులు వినాయక చవితి ఉత్సవాల్లో బిజీగా ఉన్న సమయంలో మూడు రోజుల పాటు కస్టడీకి తీసుకుని తిరిగి కోర్టుకు సరెండర్ చేశారు. ఈ కేసును నీరు గార్చటానికే ప్రణాళికలు సిద్ధం చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేసులో ప్రధాన నిందితులైన మల్లంపేట్ నరేష్, శివ, పూర్ణిమలను 16, 17, 18 తేదీలలో కస్టడీకీ న్యాయస్థానం అనుమతినిచ్చింది. జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్‌ను ఈ విషయంపై వివరణ కోరగా మూడు రోజులపాటు కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ చేసినట్టు తెలిపారు. ఓ నాయకుడికి ప్రధాన అనుచడిగా ఉన్న మల్లంపేట్ నరేష్ నుంచి కేసు విషయాలు తెలుసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారన్నా విమర్శలు ఉన్నాయి. పోలీసుల దాడుల్లో వెలుగులోకి వచ్చిన కొన్ని డాక్యుమెంట్ల వ్యవహారం బయటకు రాకుండా చూస్తున్నట్టు తెలుస్తోంది.

### హుడాకాలనీ-2లో పెద్దలడ్డూ రూ.4.21లక్షలు

చందానగర్: చందానగర్ డివిజన్ హుడాకాలనీ-2 కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉరిటి వెంకట్రావ్ ప్రజాపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈవేలం పాటలో గణపతి లడ్డూను ఎస్ఎల్ఎన్ కంపెనీ అధినేత డి.సుబ్బారావు రూ.4.21 లక్షలకు దక్కించుకున్నారు. చిన్న లడ్డూ డి.అభిరామ్‌సాయి రూ.2.25 లక్షలకు దక్కించుకున్నారు.

## కేవీఆర్ లే-అవుట్‌లో పార్కుల కబ్జాపై విచారణ

దుండిగల్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలోని కేవీఆర్ లే-అవుట్‌లో పార్కులు, ఖాళీ స్థలాల కబ్జా, అక్రమ విక్రయాలు చేసిన వారిపై దుండిగల్ పోలీసులు కేసునమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తితే.. మల్లంపేట గ్రామంలో కేవీఆర్ లే-అవుట్‌లో బీఆర్ఎస్ నాయకులు నరేష్, మరి కొంతమంది కలిసి వందల కోట్లు విలువ చేసే పది పార్కు, ఖాళీ స్థలాలను కబ్జా చేసి కోర్టును సైతం తప్పు దోవ పట్టించారు. నకిలీ ఏపీ రామరాజు పేరుతో శ్రీకాంత్ సాహు అనే వ్యక్తికి విక్రయించారు. ఈ విషయంపై ఆరు మాసాల క్రితమే బీజేపీ నాయకుడు ఆకుల సతీష్ పూర్తి వివరాలతో దుండిగల్ మున్సిపల్ కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. వారి ఫిర్యాదు ఆధారంగా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య ఉత్తర్వులు ఆధారంగా పార్కు స్థలాల్లో దుండిగల్ కమిషనర్, సిబ్బంది చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయించారు. కూల్చివేతల సమయంలోనే ఇద్దరు బీఆర్ఎస్ ప్రతినిధులు అడ్డుకున్నారు. కాకపోతే అడిషనల్ కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం నిర్మాణాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేసి, మున్సిపల్ అధికారులు కూల్చివేయాలి. కానీ మున్సిపల్ కమిషనర్ కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో బీజేపీ నాయకులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. కానీ ఇదే ల్యాండ్‌కు సంబంధించిన నరేష్ అనే వ్యక్తి ఆగస్టు 28 రాత్రి గాజులరామారంలోని ఎల్ఎస్ బార్ కాల్పుల ఘటన తరువాత నిందితుడైన నరేష్ ఆగడాలపై బుధవారం మేడ్చల్ డీసీపీని కలిసి పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేశారు. కేవీఆర్ లే-అవుట్‌లో పార్కుల కబ్జా, ఫ్రోర్జరీ డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌లపై దర్యాప్తు చేయాలని దుండిగల్ సీఐని డీసీ ఆదేశించారు. అంతే కాకుండా నరేష్, అతని గ్యాంగ్ అక్రమ ఆయుధం కలిగి ఉండడం, అసలు ఆయుధం నరేష్‌కు ఎలా వచ్చింది. ఆయుధాలు ఎవరి కోసం కొనుగోలు చేశాడనే విషయంపై విచారణ జరపాలని బీజేపీ నాయకులు డీసీపీని కోరారు.

## అనుమానాస్పదస్థితిలో స్పా సెంటర్‌లో యువతి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో స్పా సెంటర్‌లో బ్యూటీషియన్‌గా పని చేస్తున్న ఓ యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పేట్‌బషీరా బాద్ సీఐ విజయ్‌వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కి చెందిన శాంతిదాస్ మహంతి అలియాస్ సమీరా (22) జూన్ నెలలో జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డులోని శ్రీస్మార్ట్ లుక్స్ బ్యూటీ స్పా సెంటర్‌లోని పని కోసం చేరింది. నెల రోజుల క్రితం తన సొంత ఊరికి వెళ్లి వస్తానని నిర్వాహకులకు చెప్పి వెళ్లిపోయింది. మళ్లీ తిరిగి ఈనెల 14న వచ్చింది. ఆర్థికంగా ఇబ్బందులున్నాయని, తనను మళ్లీ పనిలో పెట్టుకోవాలని స్పా నిర్వాహకులు పార్వతిగీతను వేడుకుంది. దీంతో సమీరాను తిరిగి పనిలో పెట్టుకున్నారు. రూమ్ దొరికే వరకు స్పా సెంటర్‌లోనే ఉంటానని సమీరా చెప్పడంతో పార్వతిగీత ఒప్పుకుంది. అప్పటికే స్పా సెంటర్‌లో పని చేస్తున్న గాయత్రి, సమీరా ఇద్దరూ స్పా సెంటర్‌లోనే రాత్రి పడుకునే వారు. అయితే మంగళవారం గాయత్రి వినాయక చవితి సందర్భంగా చుట్టాలు ఇంటికి వెళ్లి, బుధవారం స్పా సెంటర్‌కు వచ్చిన గాయత్రి గ్రిల్స్ తాళం తీయమని సమీరాను పిలువగా సమాధానం రాకపోవడంతో యజమానికి ఫోన్ చేసి చెప్పింది. వెంటనే స్పా సెంటర్‌కు వచ్చిన పార్వతిగీత తన దగ్గర ఉన్నతాళంతో గ్రిల్స్‌ను ఓపెన్ చేసి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని సమీరా కనిపించింది. వెంటనే 100 డయల్‌కు సమాచారం ఇవ్వడంతో పేట్‌బషీరాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. తనతో ఆర్థిక ఇబ్బందులతోనే సమీరా ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని స్పా సెంటర్ యజమాని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. సమీరా వద్ద ఉన్న సెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## 'కూన జోలికొస్తే కాంగ్రెస్ నేతల సత్తా చూపిస్తాం'

దుండిగల్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): మచ్చలేని నాయకుడు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌పై బీఆర్ఎస్ కార్పొరేటర్లు మంగళవారం చేసిన వ్యాఖ్యలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పెనుదుమారం లేపాయి. వారు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం గాజులరామారంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పైన, తమ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ పైన మరో సారి నోటికి వచ్చినట్లు మాట్లాడితే బీఆర్ఎస్ నాయకులు గల్లీలో తిరగలేరని, వారిని ప్రజలే తరిమి కొడతారని హెచ్చరించారు. 35 ఎకరాల ఫోర్జరీ కేసులో జైలుకు వెళ్లి వచ్చినా, ఆ కార్పొరేటర్‌కు ఇంకా బుద్ధి రాలేదా అని ప్రశ్నించారు. అలాంటి నాయకుడు శ్రీశైలంగౌడ్ గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ప్రజలను పీడిస్తున్న కార్పొరేటర్లు ఇకనైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పని చేసింది మీరు కాదా? ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలవగానే 'మా ఎమ్మెల్యే' అంటున్నారని వారి తీరు నుదుయ్యబట్టారు. హైడ్రాకు బయపడేది కేవలం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు మాత్రమేనన్నారు. మచ్చ లేని నాయకుడు కూన శ్రీశైలంగౌడ్‌పై ఇంకోసారి నోటికి వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల బలం ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్‌లు జయరామ్, లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు బొడ్డు వెంకటేశ్వరరావు, పాల కృష్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుంజా శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగారావు, కాంగ్రెస్ నాయకులు శ్రావన్‌కుమార్, బండి శ్రీనివాస్‌గౌడ్, కృష్ణారావు, బుచ్చిరెడ్డి, కూన రఘుగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, రషీద్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, శివకుమార్, రాధాకృష్ణ, మధుసూదన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



అశోక్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, మంచినీటి పైపులైను పనులు వెంటనే పూర్తి చేయాలని జలమండలి మేనేజర్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కోరినట్లు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. బుధవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో జలమండలి మేనేజర్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన నియోజకవర్గంలో పరిష్కరించాల్సిన సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

## సీసీ రోడ్డు పనుల పరిశీలన

హైదర్‌నగర్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ జయానగర్ కాలనీలో కమాన్ టి జంక్షన్ వద్ద రూ.16 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీరోడ్డు నిర్మాణ పనులను నాణ్యతాప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం కాలనీలో పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్, విష్ణు, వెంకట్‌రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో పరస్పర దాడి

రాయదుర్గం: కొండాపూర్ గ్రామంలో పక్కపక్క గల్లీలో రెండు వినాయక మండపాల నిర్వాహకుల మధ్య మంగళవారం రాత్రి గొడవ జరిగింది. దీంతో ఒకరిపై ఒకరు కత్తులు, కర్రలతో దాడి చేసుకున్నారు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దాడిలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అ నంతరం కేసు నమోదు చేసుకున్నారు. కొండాపూర్‌లో జై గణేశ్ యూత్ అసోసియేషన్, మరో వినాయక మండపం నిర్వాహకులు పోటీపోటీగా మండపాలను ఏర్పాటు చేశారు. అయితే మంగళవారం రాత్రి మండపాల వద్ద ఇరువర్గాలు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహించారు. బంజారాహిల్స్‌కు చెం దిన చందు పైల్వాన్ సందీప్‌వర్గం, మరో వర్గమైన నీలం కిరణ్‌ముదిరాజ్, సోను వర్గాలు దాడి చేసుకున్నారు. దీంతో గచ్చిబౌలి పోలీసులు చందు పైల్వాన్, సందీప్ వర్గం, కిరణ్‌ముదిరాజ్, సోను వర్గాలపై కేసు నమోదు చేశారు.

**PUBLIC NOTICE**

All the General Public are hereby informed that my client **VINOD KUMAR DALE S/o VITAL DALE & KAMALA DALE W/o VINOD KUMAR DALE**, R/o. Hyderabad. Is intending to enter into the agreement of sale by paying the substantial token amount to the 1. Sri. **SRIDHAR TYLAM S/o T.Krishnaiah, 2.Smt. SANDHYA RANI TYLAM, w/o Sridhar Tylam** r/o. MIG-11-553, VINAY NIVAS, Flat No.301, Road No.1, KPHB Colony, Kukatpally, Hyderabad- 72. Who are the owners and possessors of the residential house no.2-128/3, admeasuring 191.00 sq.yds or 159.67 Sq. Mtrs, out of 260.00 sq.yds, with a Plinth area of 100 sq.ft COUNTRY TILE GRAMA KANTAM, Situated at: GAJULARAMARAM Village, under GHMC Cicle, Mandal & Regn Sub-Dist : Quthbullapur, Dist & Regn Dist Ranga reddy which is Morefully Described in the scheduled property.

**SCHEDULE PROPERTY**

All that the residential house no.2-128/3, admeasuring 191.00 sq.yds or 159.67 Sq. Mtrs, out of 260.00 sq.yds, with a plinth area of 100 sq.ft COUNTRY TILE GRAMAKANTAM, Situated at: GAJULARAMARAM Village, under GHMC Cicle & Mandal & Regn Sub-Dist : Quthbullapur, Dist & Regn Dist Ranga reddy, and bounded as follows:

EAST:15' WIDE ROAD,WEST:LAND OF R.KISTAIAH, NORTH: LAND OF SANJEEV REDDY, SOUTH: LAND OF NARENDER REDDY.

Hence, if any person or persons having any objections in entering into agreement of sale and subsequently executing the sale Deed as stated above, to contact in my office in person along with relevant documents in original, within a period of 7 days from the date of publication of this Notice. Thereafter no objections are entertained and the transaction be finalized.

HYDERABAD

**D.VIJAY BABU GOUD, Advocate**
# Flat No. 301, H. No. 6-10-15, "Roman Residency" Balanagar, Hyderabad-42.
CELL.NO.9849031151